# కొన్ని అనూహ్యమైన కథలు

**మేడం క్యూరీ నుంచి కల్పనా చావ్లా వరకూ కనిపించని వివక్షను దాటి విజయం సాధించిన కథలెన్నో విని ఉంటాం. గమనించాలే కానీ మన దృష్టిని దాటిపోయిన ఇలాంటి గాథలెన్నో కనిపిస్తాయి.**

1



## రోసా పార్క్స్

అమెరికాలో జాతివివక్షకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం గురించి కథలు కథలుగా చెప్పుకొంటాం. అందులో మార్టిన్ లూథర్ కింగ్ పేరు ప్రత్యేకంగా వినిపిస్తుంది. కానీ, రోసా పార్క్స్ అనే మహిళ చేసిన ఉద్యమాన్ని చాలామంది గుర్తించరు. తన రంగు కారణంగా బస్సులో సీటు ఖాళీ చేయమనడంతో మొదలైన ఆమె నిరసన... అమెరికన్ రాజ్యాంగంలో సమాన హక్కు కోసం చట్టం రూపొందే వరకూ కొనసాగింది.

2

## షెరిల్

గూగుల్, ఫేస్‌బుక్ తెలియని వాళ్లు ఇప్పుడు కనిపించరు. కానీ, ఈ రెండూ అంత ప్రజాదరణ పొందడం వెనకాల ఉన్న వ్యూహకర్త షెరిల్. గూగుల్ యాడ్స్ రూపకర్త తనే, నష్టాల్లో ఉన్న ఫేస్‌బుక్‌ని జుకర్‌బర్గ్ అభ్యర్థన మేరకు లాభాల బాట పట్టించిందీ తనే. అంతే కాదు! తన leanin.org సంస్థ మహిళలు కెరీర్లో ఎదిగేందుకు సాయపడుతున్నది. 184 దేశాల్లో ఈ సంస్థ ఉనికి ఉంది.



3





## సింధు

ఆడపిల్లవని అందరూ ఈసడించుకుంటూ పెంచితే, నిండు గర్భిణి అని కూడా చూడకుండా కట్టుకున్నవాడే నడిరోడ్డున వదిలేస్తే... లోకాన్నే తన కుటుంబంగా మార్చుకుంది. తనలా వివక్షకు, ఒంటరితనానికి గురైన ప్రతి ఒక్కరికీ తల్లిలా మారింది. 1,500 మందిని సాకింది. సింధు కాస్తా... సింధు తాయి (అమ్మ)గా మారింది.

## వివక్షతో డిప్రెషన్



ఇంగ్లండులోని లివర్‌పూల్ విశ్వవిద్యాలయంలో ఓ పరిశోధన జరిగింది. ఇందుకోసం మూడు నుంచి పద్నాలుగేండ్ల వరకూ మగపిల్లలు, ఆడపిల్లలకు సంబంధించిన దశాబ్దాకాల గణాంకాలను పరిశీలించారు. వీటి ఆధారంగా డిప్రెషన్ ఎవరిలో ఏ తీరున ఉందో గ్రహించే ప్రయత్నం చేశారు. ఆశ్చర్యం ఏమిటంటే చిన్నప్పుడు ఎలాంటి తేడా లేకపోయినా... పెరుగుతున్న కొద్దీ ఆడపిల్లల్లో కుంగుబాటు సమస్య ఎక్కువగా కనిపించింది. మగపిల్లలలో కేవలం పదిశాతం మందిలో మాత్రమే కుంగుబాటు లక్షణాలు కనిపిస్తే... ఆడపిల్లల్లో 25 శాతం మందిలో కుంగుబాటు కనిపించింది. ఆడపిల్లలు పెరుగుతున్న కొద్దీ శారీరకంగా, సామాజికంగా ఎదుర్కొంటున్న సమస్యలే ఇందుకు కారణం అని తేలింది. ఇంటాబయటా రకరకాల వివక్షలను ఎదుర్కోవడం... వాటిని ఎవరికి చెప్పుకోవాలో తెలియకపోవడం... ఇంట్లో వాళ్లు ఆడపిల్లల మనసును గ్రహించే ప్రయత్నం చేయకపోవడం వల్ల సమస్య తీవ్రమవుతోంది. సాధారణంగా ఆడవారు అన్ని విషయాలూ చెప్పుకొంటారనీ, మగపిల్లలు తమ బాధలను మనసులోనే ఉంచుకుంటారని నమ్ముతాం. ఈ పరిశోధన అందుకు విరుద్ధమైన ఫలితాలు వెల్లడించింది. ఇంట్లో ఆడపిల్లలను మరింత బాధ్యతగా పెంచాలని సూచించింది.